నమస్తే తెలంగాణ
నిజామాబాద్, శుక్రవారం 27 డిసెంబర్ 2024
FRIDAY, DECEMBER 27, 2024

# బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు


బస్టాండ్ ఆవరణలో నీళ్లు లేక నిరుపయోగంగా ఉన్న నల్లాలు


లేడీస్ బాత్రూమ్‌లకు తాళం

- పట్టించుకోని అధికారులు
- మహిళల బాత్రూమ్‌కు తాళం
- బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న నల్లాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

కామారెడ్డి, డిసెంబర్ 26 : కామారెడ్డి జిల్లా కేంద్రమైనప్పటి నుంచి పట్టణంలోని బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్నది. కానీ.. ప్రయాణికుల కోసం బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పట్టణానికి చుట్టుపక్కల జిల్లాల నుంచి నిత్యం కొన్ని వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. దూరం నుంచి మహిళలు ప్రయాణం చేసి బస్టాండ్‌లో బాత్‌రూమ్‌కు వెళ్తే అక్కడ తాళం ఉండడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ.. కార్గో పక్కన మగవారు మూత్రానికి వెళ్తే అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రయాణికులు అంటున్నారు. కనీసం అక్కడ మూత్రం పోయరాదని బోర్డుకూడా ఏర్పాటు చేయలేదని, అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుందని వారు కోరుతున్నారు.

ఈ విషయమై కామారెడ్డి ఆర్టీసీ డీఎం ఇందిరను వివరణ కోరగా బోరు పనిచేయకపోవడంతో నీటి ఇబ్బంది ఏర్పడిందని, త్వరలో కొత్త బోరు వేసి ప్రయాణికులకు నీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. బాత్‌రూమ్‌లలో పైపులను కోతులు ధ్వంసం చేయడంతో తాళం వేశామని చెప్పారు. పురుషులు బస్టాండ్ ఆవరణలో మూత్రం పోయద్దని చెప్పినా పట్టించుకోవడం లేదని సమాదానం ఇచ్చారు.

# సమ్మెతో నిలిచిన సర్వే



లింగంపేట మండల కేంద్రంలో తెరుచుకోని మండల విద్యావనరుల కేంద్రం

- ప్రతి డిసెంబర్‌లో సర్వే నిర్వహించి బడి బయటి విద్యార్థులను గుర్తించే సిబ్బంది
- ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో ఈ ఏడాది లేనట్లేనా..?

లింగంపేట, డిసెంబర్ 26: సర్వశిక్ష అభియన్‌లో పని చేస్తున్న సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో సర్వే నిలిచిపోయింది. బడి ఈడు కలిగిన విద్యార్థులకు నిర్బంధ విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది డిసెంబర్‌లో మండలంలో సర్వే నిర్వహించి బడి బయటి విద్యార్థులను గుర్తిస్తుంటారు. విద్యార్థుల వయస్సును బట్టి ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తారు. కాని సర్వశిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని ఎన్నికల సమయంలో పీసీసీ హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ముఖ్యమంత్రి స్పందించకపోవడంతో సిబ్బంది ముందుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు. దీంతో విద్యాశాఖ పనులు ముందుకు సాగడం లేదు. 16 రోజులుగా సమ్మె చేపట్టడంతో కస్తూర్బా గాంధీ గురుకులాల్లో విద్యాబోధన నిలిచిపోయింది. అలాగే ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ విద్యార్థులకు ప్రతి వారం నిర్వహించే వైద్య పరీక్షలు అందకుండా పోయాయి. వైద్యుల సలహాల ప్రకారం దివ్యాంగ విద్యార్థులకు వ్యాయమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వల్ల వైకల్యం తగ్గే అవకాశాలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లో విధులు నిర్వహిస్తున్న 76 మంది సీఆర్పీలు సమ్మెలో పాల్గొనడంతో బడి బయటి విద్యార్థుల సర్వే నిలిచి పోయింది. సర్వేలో బడి బయటి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తే ఒక సంవత్సరం విద్య పూర్తి అయ్యేది. సమ్మెలో సీఆర్పీలు పాల్గొనడంతో బడి బయట ఉన్న విద్యార్థులు ప్లాస్టిక్ సీసాలు, పాత ఇనుప సామగ్రి సేకరణలో పడ్డారు. సిబ్బంది సమ్మెలో ఉండడంతో మండల విద్యావనరుల కేంద్రాలు తెరుచుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి సర్వశిక్ష అభియాన్ సిబ్బంది సమస్యలు పరిష్కరించి, విద్యాబోధన సక్రమంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# చీపురుపట్టి.. రోడ్లు ఊడ్చి..

- కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన కార్యక్రమాలు
- 17వ రోజుకు చేరిన సమ్మె



కామారెడ్డి పట్టణంలో రోడ్డు ఊడుస్తూ నిరసన తెలియజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

కామారెడ్డి,డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్లు ఊడుస్తూ నిరసన తెలియజేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారానికి 17వ రోజు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. బడిలో ఉండే ఉపాధ్యాయులు విద్యా బోధనకు దూరమై రోడ్లు ఊడ్చుతూ నిరసన తెలియజేశారన్నారు. తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా తమను పట్టించుకోవడం లేదన్నారు. కనీస వేతనాలు లేక వెట్టి చాకిరి చేసినా తమపై ప్రభుత్వానికి దయలేదన్నారు. వెంటనే సీఎం స్పందించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేసి విద్యా వ్యవస్థను స్తంభింపజేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, కాళిదాసు, వీణ, సాయిలు, లావణ్య, సమగ్రశిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఎర్రోల్ల శ్రీనివాస్ అరెస్టు అక్రమం'

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 26 : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోల శ్రీనివాస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అరెస్టు చేసిందని, ఆయన అరెస్టు అక్రమమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్వీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సాయిబాబా గురువారం అన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉదయాన్నే పోలీసులు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో అరెస్టు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు వెనక్కి తగ్గేది లేదని, ప్రజల తరపున బరాబర్ కొట్లాడుతామని అన్నారు. అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు ఎంపిక

మాచారెడ్డి, డిసెంబర్ 26 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని గొల్ల సాగరికతోపాటు కావ్య, భవన, హర్థిక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటలకు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు.

## శతాధిక వృద్ధురాలి మృతి


షోక్రాబీ(ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 26: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన శతాధిక వృద్ధురాలు షోక్రాబీ (103) అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షోక్రాబీ గురువారం మృతిచెందింది. షోక్రాబీకి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, మనవలు, మనవరాళ్లు కలిసి సుమారు నలభైకి పైగా సంతానం ఉన్నారు. గురువారం సాయంత్రం షోక్రాబీ అంత్యక్రియలు నిర్వహించారు.

# స్వీట్ హోంలో తనిఖీలు

నిబంధనలు పాటించకపోతే చర్యలు


తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారిణి సునీత

కామారెడ్డి, డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని ఢిల్లీ వాలా స్వీట్ హోమ్స్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారిణి సునీత గురువారం తనిఖీ చేశారు. స్వీట్‌లో తీగలు వచ్చాయనే ఫిర్యాదు మేరకు అక్కడ ఫుడ్ తయారీ పరిసరాలు, వస్తు సామగ్రి, ప్యాక్ మెటీరియల్స్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుకాణాల్లో కాలపరిమితి ముగిసిన తినుబండారాలను విక్రయించొద్దని, పదార్థాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 26: ప్రభుత్వ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 1 చివరి తేదీ అని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కార్యాలయాల సంస్థ ఉన్నతాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జూన్‌లో అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దీనికి సంబంధించి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న ఉంటుందన్నారు. విద్యార్థులు కుల, ఆదాయ సర్టిఫికెట్ మీసేవ నుంచి తీసుకొని, పాఠశాల నుంచి బోనాఫైడ్ సర్టిఫికెట్ జతపరిచి, విద్యార్థి పాస్‌పోర్ట్ సైజ్ కలర్‌ఫొటో, తెల్ల కాగితంపై విద్యార్థి సంతకం, రూ.100 పరీక్ష ఫీజుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన


అన్నాసాగర్ గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 26: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో నిర్మిస్తున్న మురికి కాలువ పనులను స్థానిక నాయకులు గురువారం పరిశీలించారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించి మురికికాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభింపజేసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అన్నాసాగర్ గ్రామ నాయకులు గురుప్రతాప్, రామాగౌడ్, అహ్మద్, నజీర్, మహేందర్, భీమయ్య, లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి, సంజీవులు, దుర్గయ్య, వెంకటరమణ, సంగయ్య, పోచయ్య ఉన్నారు.

## సీపీఐ శత వార్షిక ఉత్సవాలు


సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి,డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ శత వార్షిక ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సోషలిస్ట్ విప్లవ ప్రభావంతో 1925లో కాన్పూర్ మహాసభలో సీపీఐ ఆవిర్భవించిందని అన్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిందని చెప్పారు. నైజాం నవాబుకు వ్యతిరేకంగా దున్నేవాడిదే భూమి కావాలని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అమరులైన చరిత్ర పార్టీదని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరులో సీపీఐ అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకుడు వి.ఎల్.నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి దశరథ్, సహాయ కార్యదర్శి బాలరాజ్, సీపీఐ జిల్లా నాయకులు దేవయ్య, రాజమణి, ఈశ్వర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కంపు తట్టుకొనేది ఎలా..?


మండల కేంద్రం గోపాల్‌పేటలో నల్లపోచమ్మ కాలనీకి వెళ్లే దారి పక్కన మురికి కూపంగా మారిన డ్రైనేజీ

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 26: మండల కేంద్రంలోని మటన్ షాప్‌ల మీదుగా నల్ల పోచమ్మ కాలనీకి వెళ్లే దారిలో మురుగు నీరు నిలిచి కంపు కొడుతున్నది. ప్రధాన రహదారి పక్కన మురుగుకాలువ లేకపోవడంతో కాలనీలోని మురుగునీరు రెండేండ్లుగా ఒకే చోట నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తున్నది. చెరువులో పెరిగే నాచు మాదిరి మురుగునీటిపై పిచ్చి మొక్కలు పెరిగి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. దారి వెంట వెళ్లే వారు ముక్కు మూయనిదే కాలనీ దాటలేరంటే ఆశ్చర్యపోవాల్సిందే. దీంతో కాలనీలోని ప్రజలు తీవ్ర రోగాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి మురుగు నీటిని నూతనంగా నిర్మిస్తున్న ప్రధాన రహదారి డ్రైనేజీలో కలపాలని లేదా నూతన డ్రైనేజీని నిర్మించి ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని కోరుతున్నారు.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client **M/s Shriram Finance Ltd,** Branch: BANSWADA had agreed to accord Loan to Borrower **Kollur Ramappa** S/o Kollur Madappa, Age 39 Yrs, Occ:Business, R/o H.No.1-3, Nachupalli (V) Nasrullabad (M), Kamareddy (Dist) by mortgage of the schedule referred property of **Kollur Sindhu W/o Kollur Ramappa.** The above prospective Loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(5) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

**SCHEDULE OF THE PROPERTY**

That the Dismantled house bearing No.1-3 & 1-4 admeasuring Eastern side 36'-0" fts, Western side 36'-0" fts, Northern side 40'-0" fts, Southern side 40'-0" fts total 1440.00 Sq.fts, equal to 160.0 Sq.Yds or say 133.77 Sq.Mtrs situated at Nachupally Village, Nasrullabad (M), Kamareddy District, within the limits of Gram Panchayat Nachupally under the jurisdiction of Regn.Sub Dist Banswada and Dist.Regn.Nizamabad

**Bounded as below: East :** House of Gampala Shankar, **West :** Open place of Banja Suresh **North :** House of Banja Pundarikam, **South :** Gram Panchayat Road

**Sd/- R.JAGADISHWER RAO,** Advocate
Subhashnagar, Nizamabad, Cell: 9848094409

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ

కామారెడ్డి, డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెం డింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ఎఫ్ ఫైళ్లను సీఎం వద్దకు తీసుకెళ్లి నియోజకవర్గంలో 26 మందికి రూ.16 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎక్కడ చూసినా కుక్కల బెడదే..

# బిక్కుబిక్కుమంటున్న స్థానికులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 26: మండల కేంద్రం గోపాల్‌పేటలోఎక్కడ చూసినా కుక్కల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ దవాఖాన, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్, ప్రధాన రహదారిపై నిత్యం కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. రహదారిపై వెళ్లున్న విద్యార్థులు, స్థానికులు, వాహనదారులపై దాడికి యత్నిస్తుండడంతో పలువురు గాయపడుతున్నారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిపై కుక్కలు దాడి చేయడంతో కింద పడి భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. విద్యార్థులు సైతం పాఠశాలకు వెళ్లే వరకు కుక్కల గుంపులతో ఎప్పుడు తమ మీద పడతాయోనని భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి విద్యార్థులు, వాహనదారులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


మండల కేంద్రంలో రహదారిపై సంచరిస్తున్న కుక్కల మంద

## బస్టాండ్ ముందున్న షెడ్ల కూల్చివేత


మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఉన్న చిరువ్యాపారుల షెడ్లను తొలగిస్తూ రహదారి పనులు చేపడుతున్న కార్మికులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 26: మండల కేంద్రం గోపాల్‌పేటలో నూతన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గురువారం బస్టాండ్ ముందున్న చిరువ్యాపారుల షెడ్లను తొలగించి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. బస్టాండ్ ముందు నుంచి ప్రధాన కాలువ వరకు రోడ్డు పక్కన ఉన్న షెడ్లను తొలగించారు. డ్రైనెజీ పనుల్లో భాగంగా మట్టి తొలగింపు పనులు చేపడుతున్నారు. దీంతో చిరు వ్యాపారులకు రోడ్డు పక్కన స్థలం లేకపోవడంతో..వ్యాపారం ముందుకు సాగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమకు స్థలం కేటాయించాలని కోరుతున్నారు.